**1984 రక్తాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన రచన**

చీకటి లోకాన్ని తనలో నింపుకొని విలయనాట్యం చేస్తోంది. కీచురాళ్ళు చీకటిలోనే విప్లవగీతాలు ఆలపిస్తున్నాయి. గాలికి కదులుతున్న చెట్లు భూతాల్లా కనిపిస్తున్నాయి. తమ మిణుకు మిణుకు కాంతితో లోకంలో వెలుగు నింపాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి తారలు.

గుడిసె ముందు కుక్కి మంచంలో కూర్చుని వున్నాడు కోటిగాడు. "కోటిగాడు" అంటే ఆ వూళ్ళో ఎవ్వరికీ అర్థం కాదు. "రౌడీ కోటిగాడు" అంటేనే అందరికీ తెలుస్తుంది.




తాగి ఏదో ఒక గొడవ చేయటం. ఎవరిదో ఒకరిది తల బద్దలు కొట్టటం. జైలు కెళ్ళటం వాడికి అలవాటే. పిల్లలు చూస్తే జడుసుకునే 'బూచాడి' ఆకారంవాడిది. ఎర్రగా నిప్పు కణికల్లా వుండే పెద్ద కళ్ళు. కండలు తిరిగిన ఒళ్ళు. పైకితిప్పిన మీసాలు. విశాలమైన ఛాతీ ... ఒక్కసారి చూస్తే మరిచిపోలేము కోటిగాడ్ని. వాడితో విరోధం పెట్టుకోవటానికి ఆ వూర్లో పెద్ద పెద్ద రైతులకే గుండెలు చాలవు. కారణం ఏమిటంటే 'పెద్దొర'గారి అండ వాడి కుండటమే.

బీడి తీసి వెలిగించాడు కోటిగాడు. గట్టిగా గుండెల నిండా పొగ పీల్చి నాలుగు దమ్ముల్లో బీడీని అవతల పారేశాడు. వాడి కళ్ళల్లో పట్టుదల స్పష్టంగా కనబడుతోంది. మంచానికి వున్న కర్ర చేతిలోకి తీసుకొని నిలబడి బయల్దేరబోతుండగా "ఏంద య్యోయ్! యాడికి బయల్దేరినవ్? పొద్దోయింది పండుకోరాదూ! ...." కోటిగాడి పెళ్ళాం లచ్చి చేయి కొంగుతో తుడుచుకుంటూ బయటకొచ్చింది.

ఏం చెప్పాలో తోచలేదు కోటిగాడికి. కోపంగా సమాధానం చెపితే ఏడుపు ఉబికివస్తుంది లచ్చికి. ఆ విషయం కోటిగాడికి బాగా తెలుసు.

"ఏం లేదే! దొరగారు పని చెప్పిండు. ఆ పని కానించి వత్తా" లచ్చి ఏం చెప్తుందోనని ఆగాడు కోటిగాడు.

"రేతిరి పనేంది? రేప్పగలు చూస్కోరాదా ఏంది?" మూతి ముడుచుకుంటూ అడిగింది లచ్చి.

"అది కాదే .. మన చిన్నదొర బాసకరం బాబు లేడటే.... ఆయనగోరికి పెల్లయి ఎంత కాలమైందో సెప్పు .. నిండా మూడు మాసాలు కాలేదుగందా. మరి ఆయనగారేమో రాత్రిల్లు పెల్లాన్ని వదిలేసి పనిమాలా ఎల్లి ఆ కోళ్ళ పారంకాడ తొంగుంటున్నాడు. నేను పొలవెల్తా మొన్నరాత్రి చూసిన. చిన్నదొర పారంకాడ లైటేసుకొని సదూకుంటుండాడు. మళ్ళీ నిన్న చూసిన. అట్లనే.... అక్కడే అగుపడ్డాడు. పలకరించిన.... నవ్విండాయన

'ఏంది చిన్నదొరా! తమిరిక్కడున్నారేంది? ... నిన్న గూడ చూసినా. "పెద్దొర"గారు ఏదైనా అన్నారా ఏంది?' అనడిగిన. చిన్నదొర నవ్వి 'అదేంలేదులేగాని. నువ్వెల్లి వణ్ణం పంపించమని సెప్పు' అన్నాడు నే మాటాడ్డానికి అవకాశం ఈకుండా

"సరేగందాని దొరగారింటికెల్లిన. అక్కడ పెద్దొరగారు కూకొని ఆలోచిత్తన్నారు. నన్ను చూసిండాయన. 'ఏందిరా కోటిగా! యాణ్ణుంచి' అడిగిండు పెద్దొర.

'అయ్! పారంగాడ్నుంచండయ' అన్నాను.

"పెద్దదొరగారి ముఖం ముడుసుకు పోయింది. ఆయనగోరు బాదపడుతున్నారని తెలుత్తానే వుంది. 'వాడక్కడే వున్నాడా?' అని అడిగిండు పెద్దదొర.

"అవ్వుడు సెప్పినాడు అసలిసయం పెద్దొర."

అప్పటివరకు తలదించుకొని మాట్లాడుతున్న కోటిగాడు అలికిడై తలఎత్తి చూశాడు.

"ఏరోయ్ కోటిగా! నువ్వింకా కదల్లేదా.... పెద్దొరగారు ఎంపెట్టుకు తీసక్కరమ్మన్నారు విన్నా" నారిగాడు నిలబడి వున్నాడు యెదురుగా.

"ఆ! వత్తండా. నరేయే లచ్చి....నే పోతుండా.... నా కోసరం ఓరన్నా వత్తె నే లేనని సెప్పు...."గబగబా అడుగు లేస్తూ నారిగాడితోపాటు చీకట్లో మాయమయ్యాడు కోటిగాడు.

* * * *

చుట్ట కొనకొరికి నోటిలో పెట్టుకున్నాడు పెద్దొర. వినయంగా చేతులు కట్టుకు నుంచున్నాడు కోటిగాడు. వాడి కళ్ళలో భక్తి. గౌరవం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పెద్దొర అంటే వాడికే కాదు. ఊరందరికీ గౌరవమే.... భయం కూడా. పెద్దదొరగారి మనను చిన్నబుచ్చుకోవటం నచ్చలేదు వాడికి అందుకే తనే ఈ సమస్యను ఎలాగైనా తేల్చాలని అనుకున్నాడు. కోటిగాడు పట్టుకున్న కర్ర అతని కరకు చేతిలో నలిగిపోసాగింది.

"అయితే అలా చేస్తానంటావా" అడిగాడు పెద్దొర.

"అవున్దొర! ఈ రాత్రికే దాని అంతు తేలుత్తా.. అయినా చిన్నదొరగారిని పారంగాడికి ఎల్లొద్దని తమరు సెప్తే ఇనక పోతారా" సందేహం వెలిబుచ్చాడు కోటిగాడు.

"నేను చెప్పాన్రా. వాడు వింటేనా! 'లక్షలతోటి వ్యాపారం. జాగ్రత్తగా చూచుకోకపోతే ఇక చేతికి చిప్పే' అన్నాడు వీడేదో మహా ఉద్ధరిస్తున్నట్టు" కోపంగా అన్నాడు పెద్దొర.

"అది రోజూ పారంగాడికి వత్తున్నట్టు తమతో నారిగాడు సెప్పిండా" అడిగాడు కోటిగాడు.

"ఆఁ, వాడి ముఖం. వాడో నిద్రముఖంనాయాల....'పారం కాడ కావలాకాయరా' అంటే. సుబ్బరంగా స్టోర్ రూంలో దూరి గుర్రు పెడుతున్నాడు ఎదవ. అక్కడికీ 'అది రావటం చూశావా' అని అడిగా. 'అసలట్టాంటిదేమీ లేదు' అని బుకాయించాడు. కాని ఆ తరువాత అది రోజూ వస్తూనే వుందని రుజువులతో సహా తెలిసింది. ఇక మీ చిన్న దొర పెళ్ళాన్ని వదిలేసి దానికోసం అక్కడ కూచుంటున్నాడు. దీన్తస్సదియ దీని పీడ విరగడైతే గాని మీ చిన్న దొర హాయిగా కాపురం చేయడ్రా"– కొడుకు సుఖంకోసం తండ్రి పడుతున్న ఆవేదనది.

"అయితె అది ఎన్నింటి కొత్తుందయ సుమారు" అడిగాడు కోటిగాడు.




"మొన్న నర్సింగంగాడు చూశాట్ట దాన్ని. రాత్రి పన్నెండు గంటలకు అది చిన్నదొర మంచంకాడ నుంచొని నర్సింగాన్ని చూచి గడ్డివాము పక్క-కెళ్ళి మాయమయ్యిందట."

"అట్టాగా" నోరెళ్ళబెట్టి వింటున్నాడు కోటిగాడు.

"అవున్రా! అది మా చిన్న దొరకి శనిలా దాపురించింది. ప్రతిరోజూ అది రావటం. దాని కోసం వీడు గడ్డివాము లెమ్మట. పాకలెమ్మట తిరగటం.... ఇక రాత్రంతా జాగారం చేసి ఇంటి కొచ్చి పడుకోవటం..... మళ్ళి రాత్రయ్యేసరికి పారంకాడికెళ్ళి పోతాడు. కోడలు పిల్ల ఎంత బాధపడుతున్నదో వీడేమైనా ఆలోచిస్తున్నాడా" బాధగా అన్నాడు పెద్ద దొర.

కోటిగాడికీ బాధగానే వుంది అంత పెద్దదొరగారు తనబోటి అల్పుడితో అన్ని విషయాలు చెపుతున్నాడంటే ఆయనకు ఎంత బాధగా వుందో అతనూహించుకొన్నాడు.

"తమరు నిచ్చింతగా ఉండండి దొరా. నాయాల్ది ఈయాల కాదో, పేదో తేల్చేత్తాను" చేతిలోని కర్ర నేలకేసి కొడుతూ అన్నాడు కోటిగాడు.

"ఆఁ అన్నట్టు నీ పొలానికి ఎరువు కావాలన్నావ్‌గా, వచ్చి తీసికెళ్ళు" అన్నాడు పెద్దొర

"అయ్ చిత్తం...." కృతజ్ఞతతో మెరిశాయి కోటిగాడి కళ్ళు.

"ఏరోయ్! అసలిషయం మరిచేవ్....మరి ఈ రాత్రికే ఎలాగైనా దాన్ని...."


"ఆ మాట తమరు వేరే చెప్పాలా దొరా" అంటూనే బయటకు నడిచాడు కోటిగాడు.

'ఈ దెబ్బతో దాని పనిసరి.' సాలోచనగా మీసం మెలేశాడు పెద్దొర.

* * *

కోటిగాడి కళ్ళు పరీక్షగా చూస్తున్నాయి ఫారంవంకే. ఫారంలో

## పరిచయం



పుట్టింది 31—8—59 లో. చల్లపల్లి (దివితాలూకా) స్వగ్రామం. ఇంటర్ వరకు చల్లపల్లి రాజా కళాశాలలో చదివాను. బి. కాం. మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో చదివాను. కవితలు. కథలు వ్రాయటం. కథల్ని. కవితల్ని జాగ్రత్తగా భద్రపరచటం. కలం స్నేహం చేయటం హాబీలు.

ప్రస్తుతం విజయవాడ ఆర్థిక సమతా మండలిలో కార్యకర్తగా పని చేస్తున్నాను. ఇష్టదైవాలు : ఫ్రెండ్స్.

— ఎం. ఎ. రవూఫ్

వెలుగుతున్న లైట్లు ఫారం చుట్టూ వున్న ప్రదేశాల్ని కొద్ది కొద్దిగా చూపిస్తున్నాయి కోటిగాడి కళ్ళకు. చిన్నదొర భాస్కరం ఫారం ప్రక్కనే మడత మంచంపై గుర్రు పెడుతున్నాడు. ఫారం ఊరు చివర వుండటంతో ఏ అలికిడీ లేక ప్రశాంతంగా వుంది. పట్నం వెళ్ళే రోడ్డు ప్రక్కనే తనపొలంలో కట్టించారీ ఫారాన్ని పెద్దదొరగారు. అది దినదినాభివృద్ధి చెంది తాలూకాకే పెద్ద ఫారమై కూర్చుంది.

రోడ్డు ప్రక్కనేవున్న చింత చెట్టుక్రింద నిలబడి వున్నాడు కోటిగాడు. అతని ఒళ్ళు తూలిపోతోంది. అతని కళ్ళు మాత్రం తీక్షణంగానే వున్నాయి. ఎవరైనా అతని దగ్గరకు వెళితే సారా వాసన గుప్పుమనటం ఖాయం.

బీడీ వెలిగించబోతున్న కోటిగాడు ఏదో ఆకారం ఫారం కేసి నడవటం కనబడగానే బీడీతీసి జేబులో వేసుకుని జాగ్రత్తగా చూశాడా ఆకారాన్ని. ఆ ఆకారం భాస్కరం పడుకొనివున్న మంచానికి కొద్ది దూరంలో నిలబడి చుట్టూ పరికించి చూసింది, తననెవరైనా గమనిస్తున్నారేమోనని. ఎవరూవున్నట్లు కనిపించక పోవటంతో ఫారానికి చుట్టూవున్న ఇనుపతీగలపై మెల్లగా శబ్దం చేయసాగింది.

భాస్కరానికి మెలుకువ రాలేదు.

అది శబ్దాన్ని మరికాస్త పెంచింది.

ఇదంతా చూస్తున్న కోటిగాడు ఆవేశం ఆపుకోలేకపోయాడు. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వామి ప్రక్కకొచ్చి ఆ ఆకారం కేసి చూశాడు. అది అక్కడే వుంది. అది ఎంత శబ్దం చేస్తున్నా. పగలు నిద్రపోలేదేమో పాపం భాస్కరానికి మెలుకువ రాలేదు. భగవంతుని దయవల్ల భాస్కరంబాబు మేలు కోకపోతే తన పని సానుకూలమౌ తుందనుకున్నాడు కోటిగాడు.

ఇదే సరైన సమయం. ఇక తాత్సారం చేయటం అనవసరం అనిపించింది కోటిగాడికి.

"ఆగే ...... ఎదవలం........"కర్ర పైకెత్తి ఆ ఆకారం పైకి దూకాడు కోటిగాడు.

ఆ హఠాత్పరిణామానికి ఆ ఆకారం బిత్తరపోయింది. అది తేరుకునే లోపే కోటిగాడి చేతిలోని కర్ర ఆ ఆకారం తలను బలం తాకింది.

భయంకరమైన అరుపు....చెట్లమీదున్న పక్షులు భయభ్రాంతులై అరుస్తూ ఎగిరిపోసాగాయి. ఆ ఘోరాన్ని చూడలేమన్నట్లు మబ్బుచాటున దాక్కుంటున్నాయి చుక్కలు.

ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు భాస్కరం. హలుతూ మంచం దగ్గరకొచ్చి నిలబడ్డాడు కోటిగాడు.

"ఎవరూ! కోటిగాడా! ఏం జరిగింది...." నిద్రమత్తు వదల్లేదు భాస్కరానికి.

"జరగాల్సిందే జరిగిందొర...." వేలుపెట్టి ఆ ఆకారం పడివున్న చోటు చూపాడు కోటిగాడు.

కళ్ళు చిట్లించి చూశాడు భాస్కరం. తల పగిలి రక్తసిక్తమై కొట్టుకుంటూ పడివుంది.... జంగురుపిల్లి.

"అమ్మయ్య! వారం రోజులుగా కాపేస్తున్నా తప్పించుకు తిరుగుతోంది. ఇప్పటికే పది కోళ్ళను స్వాహా చేసేసింది. ఇక నిశ్చింతగాఇంటికెళ్ళిపడుకోవచ్చు"చిన్నదొర మురిసిపోతున్నాడు "మరిక మీరు ఇంటి కెళ్లండయ్య. మీ కోసం చిన్న దొర్సాని బెంగెట్టుకున్నారేమో" తన బాధ్యత నెరవేరిన ఆనందంలో అన్నాడు కోటిగాడు.

"సరే. పద" హుషారుగా ఇళ్ళకి దారితీశారు కోటిగాడు. చిన్నదొర. భాస్కరం.











OBM/2075 R-TEL